

మాట్లాడుతున్న డీఈవో అశోక్

బాల భవన్‌లో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులలో విద్యార్థులలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతియేటా జిల్లాకేంద్రంలోని బాల భవన్ ఆధ్వర్యంలో జరిగే శిక్షణ తరగతులను శుక్రవారం డీఈవో అశోక్ ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నటరాజ విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. తరగతి గదిలో ప్రతిరోజు చదువు మాత్రమే నేర్చుకునే వారికి ఈ శిక్షణ తరగతులు కొంత వరకు ఆటపాటలతో వేసవి శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని అన్నారు. ఆటలపాటలతో బాల భవన్‌లో అందించే శిక్షణను విద్యార్థులు శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, మ్యాజిక్, నీతి కథలు, యోగా, నాటకం, స్కేటింగ్, టైలరింగ్, కర్రసాము వంటి 30 అంశాలలో విద్యార్థులకు తరగతులు జరుగుతాయని ఆయన అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి శిక్షణ తరగతుల్లో సృజనాత్మకతను వెలికితీసే విద్యను నేర్చుకోవడం వల్ల ఏకాగ్రత మానసిక ప్రశాంతతో పాటు చదువుపై మక్కువ మరింత పెరుగుతుందని అన్నారు. బాలభవన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఉమాబాల మాట్లాడుతూ బాల్‌భవన్‌లో విద్యార్థులకు నెలరోజుల పాటు శిక్షణ అందించడం జరుగుతుందని, సెలవులు అయిపోయిన తర్వాత ప్రతీ ఆదివారం తరగతులు జరుగుతాయని విద్యార్థులు ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం జాదు రంగనాథ్ మ్యాజిక్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బాల్‌భవన్ మాజీ సూపరింటెండెంట్ ప్రభాకర్, సిబ్బంది వెంకటలక్ష్మి, పుష్పలత, లక్ష్మణ్, నటరాజ్, శ్వేత, శ్రీలత, లలిత, నమ్రత, సోనాలి, గణేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

38 మంది హోంగార్డుల బదిలీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 38 మంది హోంగార్డులను బదిలీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి కామారెడ్డికి 38 మందిని బదిలీ చేయగా కామారెడ్డి నుంచి నిజామాబాద్‌కు 38 మంది హోంగార్డులు బదిలీపై రానున్నారు. గతంలో 317 జీవో వల్ల కామారెడ్డికి వెళ్లిన జిల్లాకు చెందిన హోంగార్డులను తిరిగి సొంత జిల్లాలకు బదిలీపై వస్తుండగా అక్కడి నుంచి ఇక్కడికి వచ్చిన వారిని తిరిగి కామారెడ్డికి బదిలీ చేశారు. డ్రా పద్ధతిలో బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. తప్పనిసరిగా ఏడాది పాటు పోలీసులు కొత్త జిల్లాలో పని చేయాలని నిబంధనలు ఉండటంతో ఆ ప్రకారం పరస్పర బదిలీలను పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఏడీఈ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిలక్ గార్డెన్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతీనగర్, గోపాల్‌బాగ్, జేజేరెడ్డి ఆసుపత్రి, పోచమ్మ గల్లి, ద్వారకనగర్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరుసగా మూడవ రోజు జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాపై భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వరుసగా మూడవ రోజు జిల్లాలో రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బెంబెలెత్తుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత ఉండటంతో ప్రజలు రోడ్లపైకి రావడం లేదు. ఈ వేసవిలో శుక్రవారం జిల్లాలో అత్యధికంగా రికార్డు స్థాయిలో 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత పెర్కిట్‌లో నమోదు అయ్యింది. జిల్లావ్యాప్తంగా 10 ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. మరో 16 ప్రాంతాలలో 44 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. జిల్లా అంతటా ఇతర ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతుంది. ఏప్రిల్ నెల చివరి వారంలోనూ జిల్లాలో రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా మే నెలలో మరింత ఎండలు ముదిరే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎండ తీవ్రత వల్ల ప్రజలు రోడ్లపైకి రావడం లేదు. అత్యవసర పనులు తప్పితే మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటకు రావద్దని వైద్య అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారం రేంజల్ మండలం బాగేపల్లిలో వడదెబ్బతో గొర్రెల కాపరి సినిగిర పెద్దములుగొండ అనే వ్యక్తి మృతి చెందాడు. అంతేకాకుండా జిల్లాలో శుక్ర వారం పెర్కిట్‌లో 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మంచిప్పలో 45.3, మగ్గిడిలో 45.2, వేంపల్లిలో 45.2, ఎడపల్లిలో 45.1, ఏర్గట్లలో 45.1, కమ్మర్‌పల్లి, మెండోరా, నిజామాబాద్, మోస్రాలలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.



జోరుగా.. ఇసుక తవ్వకాలు!

- జిల్లాలో కొనసాగుతున్న ఇసుక, మట్టి, మొరం, నల్లమట్టి దందా
- నేతల కనుసన్నల్లో.. చక్రం తిప్పుతున్న వారి అనుచరులు, బంధువులు
- అనుమతుల మాటున ఎక్కువ మొత్తంలో వాహనాల ద్వారా తరలింపు
- నేతల ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నేతల కనుసన్నల్లో ఇసుక, మట్టి, మొరం, నల్లమట్టి దందా జోరుగా సాగుతోంది. వారి అనుచరుల ఆధ్వర్యంలో మంజీరా, వాగుల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. జోరుగా తరలిస్తూ అమ్మకాలు చేస్తున్నారు. మంజీరా వెంట కొన్ని ప్రభుత్వ అవసరాల కోసం అనుమతులు ఇచ్చినా.. మిగతాచోట్ల మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు చేస్తున్నారు. అనుమతుల మాటున కూడా ఎక్కువ మొత్తంలో ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. మట్టి, మొరం తవ్వకాలకు కొద్దిమందికే అవకాశం ఉన్నా.. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వ కాలు చేస్తున్నారు. నిత్యం పెద్దఎత్తున వాహనాల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎస్సారెస్పీ నుంచి నల్లమట్టి తవ్వకాల్లో ప్రజాపతినిధుల అనుచరులు, బంధువులు చక్రం తిప్పుతున్నారు. నిత్యం వాహనాల్లో నల్లమట్టిని తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. నల్లమట్టి తరలింపులో గ్రామాల్లో ఇబ్బందులు రాకుండా కమిటీలను కూడా మేనేజ్ చేస్తున్నారు. అధికారులపై నేతల ద్వారా ఒత్తిడి పెంచుతూ యథేచ్ఛగా తవ్వకాలను చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ అక్రమ తవ్వకాల్లో నేతల అనుచరులు, బంధువుల ప్రమేయం ఉండటంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన చోట నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. వాహనాలను సీజ్ చేస్తున్నారు.

వేసవి కావడంతో డిమాండ్

వేసవి కావడంతో ఇసుక, మట్టి, మొరం, నల్లమట్టికి డిమాండ్ పెరిగింది. నిర్మాణాల కోసం ఇసుక, మొరం, మట్టిని ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నిర్మాణానికి వినియోగిస్తున్నారు. ఇవే కాకుండా ఇతర నిర్మాణాలకు వాడుతున్నారు. వేసవి కాలంలో నిర్మాణాలు ఎక్కువగా మొదలు కావడంతో వీటికి డిమాం డ్ పెరిగింది. ఇసుకను గోదావరి నుంచి తీసుకురావడం దూరం కావడం ఎక్కువగా డబ్బులు అవుతుండటంతో దగ్గరగా దొరికే ఇసుకపై ఆధారపడుతున్నారు. అంతేకాకుండా డబ్బులు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్ ఉండటంతో జిల్లాలో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొంతమంది నేతల అనుచరులు మంజీరా, పెద్దవాగు, కప్పలవాగుతో పాటు ఇతర వాగుల్లో తవ్వకాలు చేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ప్రభుత్వ అవసరాల కోసం తహసీల్దార్లు కొన్ని చోట్ల అనుమతులు ఇస్తున్నా.. మిగతా చోట్ల అనధికారికంగానే తవ్వకాలను చేస్తున్నారు. జిల్లాలో మంజీరా వెంట పోతంగల్ నుంచి రేంజల్ వరకు కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ అవసరాల కోసం అనుమతులను ఇస్తున్నారు. ఈ నదుల వెంట రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కూడా ఈ మధ్యనే ఐదు క్వారీలను మంజూరు చేశారు.

ప్రైవేటు భూముల్లోనూ అనుమతులు

బోధన్ మండలం పరిధిలో ప్రైవేటు భూముల్లో కూడా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ఇవి మినహా ఇస్తే మిగతా చోట్ల అనుమతులను ఇవ్వలేదు. ఈ నది వెంట ప్రభుత్వ అవసరాలకు అనుమతులు ఇస్తుండగా ఎక్కువ మంది నేతల అనుచరులు దానిని సాకుగా తీసుకొని ఎక్కువ మొత్తంలో ఇసుక తరలిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్ల కెపాసిటీకి మించి ఇసుకను తరలిస్తున్నారు. అనుమతులు ఉన్నచోటనే కాకుండా లేనిచోట్ల కూడా నిత్యం ఈ తవ్వకాలను చేస్తున్నారు. ఎక్కడైనా అధికారులు పట్టుకుంటే వారిపై ఒత్తిళ్లను పెంచుతూ వాహనాలను విడుదల చేపిస్తున్నారు లేదా నామమాత్రం ఫైన్‌లు వేసి వదిలి పెడుతున్నారు. అన్నిచోట్ల నేతల ప్రమేయం ఉండటం వల్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మంజీరా వెంట నిత్యం తవ్వకాలు చేస్తూ నేతల అనుచరులు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. కిందిస్థాయిలో కొంత మంది అధికారులకు కానుకల రూపంలో అందిస్తున్నారు. నేతలు, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, రవాణా శాఖకు చెందిన కొంత మంది అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉంటూ ఈ దందాను కొనసాగిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన సమయంలో, ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చిన సమయంలో మాత్రం ఎక్కువ మొత్తంలో వాహనాలు పట్టుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా వాగుల్లో తవ్వకాలు

మంజీరా నదీ కాకుండా జిల్లాలోని కప్పలవాగు, పెద్దవాగుతో పాటు ఇతర వాగుల్లో పెద్ద ఎత్తున తవ్వకాలను చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణం కోసం డీడీలు కట్టిన వారికి అనుమతులు ఇస్తున్న తవ్వకాల సమయంలో అక్రమంగా రవాణా చేసేవారు ఎక్కువగా చేస్తున్నారు. ఈ దందా వెనుక కొంతమంది నేతలకు చెందిన అనుచరులు ఉండటంతో పట్టించుకోవడం లేదు. జిల్లాలో మట్టి, మొరం తవ్వకాలపై నియంత్రణ లేదు. కొన్నిచోట్ల అనుమతులు ఇస్తున్నా మిగతా చోట్ల మాత్రం ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. నిజామాబాద్ నగరం చుట్టూ ఉన్న మండలాల పరిధిలో అనుమతులు లేని చోట్ల కూడా భారీ ఎత్తున తవ్వకాలను చేస్తున్నారు. జిల్లా జైలు పక్కనే ఎక్కువ మొత్తంలో తవ్వుతూ సరఫరా చేస్తున్నారు. మోపాల్, నిజామాబాద్ రూరల్, మాక్లూర్, ఎడపల్లి, డిచ్‌పల్లి మండలాల పరిధిలో ఎక్కువ మొత్తంలో ఈ మట్టి, మొరం దందా కొనసాగుతుంది. నగరం పరిధిలోని కీలక నేతల అనుచరులు ఈ దందాను కొనసాగిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొంత మంది నేతల బంధువులతో పాటు అనుచరులు ఈ దందాను కొనసాగిస్తున్నారు. పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నా.. అన్ని శాఖల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎక్కడైనా అధికారులు వాహనాలు సీజ్ చేస్తే ఫోన్‌లు వస్తుండటంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొంతమంది అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో లీవ్‌లు పెట్టి వెళ్తున్నారు. తర్వాత ఇతర ప్రాంతాలకు బదిలీ చేసుకుంటున్నారు. నగరం చుట్టూ మండలాలే కాకుండా ఆర్మూర్, జక్రాన్‌పల్లి, నందిపేట, రుద్రూర్, బోధన్, రేంజల్, ఏర్గట్ల, భీంగల్‌తో పాటు ఇతర మండలాల్లో ఎక్కువగా ఈ తవ్వకాలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా అటవీ, రెవెన్యూ, ఇతర భూముల్లో తవ్వకాలను చేస్తున్నారు. గనులు, భూగర్భ శాఖలతో పాటు రెవెన్యూ సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా.. ఎక్కడా పట్టించుకోవడం లేదు.

బొందలు గడ్డలుగా ప్రభుత్వ భూములు

ఈ తవ్వకాల వల్ల గుట్టలు మాయమవుతుండగా.. పలుచోట్ల ప్రభుత్వ భూములు బొందలుగా మారిపోతున్నాయి. ఎస్సారెస్పీ నుంచి నల్లమట్టి దందా ఎక్కువగా కొనసాగుతోంది. పంచగుడి నుంచి ఎక్కువగా తవ్వకాలు చేస్తూ నిత్యం వందలాది వాహనాల ద్వారా నల్లమట్టిని తరలిస్తున్నారు. ఈ నల్లమట్టి తరలించే గ్రామాల పరిధిలో కమిటీలను మేనేజ్ చేస్తూ సరఫరా చేస్తున్నారు. పలుచోట్ల వాహనానికి కొంత మొత్తంలో చెల్లింపులు చేస్తూ సరఫరా చేస్తున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులకు చెందిన బంధువులు ఈ దందాను కొనసాగిస్తున్నారు. పైనుంచి ఆదేశాలు ఉండటంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ నల్లమట్టి తవ్వకాల్లో నిత్యం లక్షల రూపాయలు ఆర్జిస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో జరుగుతున్నా.. ఏమీ చేయలేమని కొంతమంది అధికారులు తెలిపారు. నేతల ప్రమేయం ఉండటం, వారి అనుచరులు దందా చేయడం వల్ల అరికట్టలేని పరిస్థితి ఉందని వారు తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్ షురూ..

- రీజియన్‌లో 195 బస్సుల్లో ఛలో టిమ్స్ మిషన్లు
- సక్సెస్ అయితే అన్ని బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్
- ప్రయాణికులకు, కండక్టర్లకు తప్పనున్న చిల్లర బాధలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచం మొత్తం డిజిటల్ వైపు పరుగెత్తుతుంటే తామేమీ తక్కువ కాదంటూ ఆర్టీసీ సంస్థ కూడా బస్సుల్లో డిజిటల్ పేమెంట్‌లకు కార్యాచరణ సిద్ధం చేసింది. చాలా రోజుల నుంచి ఆర్టీసీలో సైతం డిజిటల్ పేమెంట్‌లను తేవాలని ప్రయాణికుల నుంచి ఒత్తిళ్ల మేరకు ఆర్టీసీ సంస్థ సైతం డిజిటల్ పేమెంట్‌లను తెచ్చింది. రాష్ట్రంలో ఇప్పటికే చాలా డిపోలకు చెందిన బస్సులలో టిమ్స్ మిషన్‌లలో డిజిటల్ పేమెంట్‌ల ద్వారా టికెట్‌లను జారీ చేస్తున్నారు. బస్సులలో ముఖ్యంగా టిక్కెట్ జారీల విషయంలో చిల్లర కష్టాలు ఎక్కువగా ఉంటా యి. ప్రస్తుత లావా వరకు డిజిటల్ పేమెంట్ లావాదేవీలకే మొగ్గు చూపుతున్నారు కాగా, ఈ డిజిటల్ లావాదేవీలతో చిల్లర కష్టాలకు చెక్ పడనుంది. నిజామాబాద్ రీజియన్‌లో సుమారు నాలుగు డిపోల్లో ప్రయోగాత్మకం గా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు ముందుకువచ్చారు. ఈడిపోల్లో ప్రస్తుతానికి 195 టిమ్స్ డిజిటల్ మిషన్లను కేటాయించారు. అవి సక్సెస్ అయితే రీజియన్ వ్యాప్తంగా అన్ని బస్సుల్లో టిమ్స్ డిజిటల్ మిషన్లను అందుబాటులో ఉంచనున్నారు.

ఇప్పటికే చాలా డిపోల్లో..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చాలా డిపోల్లో ఇప్పటికే డిజిటల్ పేమెంట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. గత కొన్ని రోజుల క్రితం నిజామాబాద్ రీజియన్‌లో 195 టిమ్స్ డిజిటల్ పేమెంట్ మిషిన్లను అందుబాటులోకి తెచ్చారు. నిజామాబాద్ రీజియన్‌లోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్-1, నిజామాబాద్-2, బాన్సువాడ, కామారెడ్డి డిపోల్లోని రాజధాని, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉంచారు. ముఖ్యంగా సుదూర ప్రాంతాలు ప్రయాణించే బస్సుల్లో మాత్రమే ఈ యంత్రాలను అందజేశారు. పామూరు, కనిగిరి, ఉద్గిరి, నెల్లూరు, బెంగళూరు, తిరుపతి, శంషాబాద్, తదితర సుదూర ప్రాంతాలకు ప్రయాణించే బస్సుల్లో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి వీటిని నిశితంగా పరిశీలిస్తూ ఎలాంటి సమస్యలు వస్తున్నాయో? తెలుసుకుంటున్నారు. సమస్యలు ఉత్పన్నం కాకపోతే రీజియన్ వ్యాప్తంగా అన్ని బస్సుల్లో డిజిటల్ పేమెంట్ యంత్రాలను వాడేలా చర్యలు తీసుకోనున్నారు. నిజామాబాద్ ఆరు డిపోల్లో మొత్తంగా 485 ఛలో టిమ్స్ మిషిన్లు వచ్చాయి. ఆర్మూర్ డిపోకు 65, బోధన్ డిపోకు 85, నిజామాబాద్-1 90, నిజామాబాద్-2 75, బాన్సువాడ 65, కామారెడ్డి 105 ఛలోటిమ్స్ జిల్లాకు చేరుకున్నాయి. ఇందులో 195 మిషన్లను ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్, లగ్జరి, రాజధాని బస్సుల్లో వాడుతున్నారు.

చిల్లర కష్టాలకు చెక్

నిత్యం ఏదో ఒక బస్సుల్లో చిల్లర కోసం కండక్టర్లకు, ప్రయాణికులకు మధ్య గొడవలు సర్వసాధారణంగా జరుగుతుంటాయి. చిల్లర కోసం కొట్టుకున్న సంఘటనలు కూడా కోకోల్లొలుగా ఉన్నాయి. డిజిటల్ పేమెంట్‌తో చిల్లర కష్టాలకు చెక్ పడనుంది. ప్రస్తుత స్మార్ట్ యుగంలో మొబైల్ ఫోన్‌లు అందరి వద్ద అందుటులో ఉంటున్నాయి. ఎక్కువ మంది దగ్గర నగదు ఉంచుకోవడం లేదు. దీంతో అందరు ఏ చిన్న కొనుగోలు చేసినా డిజిటల్ పేమెంట్‌కే మొగ్గుచూపుతున్నారు. ఆర్టీసీలో డిజిటల్ పేమెంట్ కోసం చాలా రోజులుగా ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.

బస్సులో డిజిటల్ పేమెంట్ ఉపయోగకరం

: శ్రీకాంత్, వన్నెల్(కే), ప్రయాణికుడు



ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ పేమెంట్ తీసుకురావడం సంతోషకరం. ప్రస్తుత కాలంలో నగదు ఎవరు దగ్గర పెట్టుకోవడం లేదు. బస్సులో ప్రయాణించినప్పుడు చిల్లర కోసం ఇబ్బందులు పడుతున్నాం. గమ్యం వచ్చినపు బస్సుదిగే సమయంలో చిల్లర తీసుకోవడం మర్చిపోతున్నాం. డిజిటల్ పేమెంట్‌తో టికెట్ ధర ఎంత ఉందో అంతే పేమెంట్ చేయవచ్చు.

రీజియన్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం

: జోత్స్న, రీజియన్ మేనేజర్, నిజామాబాద్



ఆర్టీసీ సంస్థలో డిజిటల్ పేమెంట్‌లో భాగంగా ప్రయోగాత్మకంగా నిజామాబాద్ రీజియన్‌లోని కొన్ని సుదూర ప్రాంతాల బస్సుల్లో డిజిటల్ పేమెంట్ టిమ్స్ మిషన్లను వాడుతున్నాం. ఇప్పటి వరకు నాలుగు డిపోల్లో సుమారు 195 యంత్రాలను అందుబాటులో ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని తెలుసుకుంటున్నాం. అన్ని సక్సెస్ అయితే అన్ని రూట్ల బస్సులలో డిజిటల్ పేమెంట్ మిషన్లు అందుబాటులో ఉంచుతాం.

రజతోత్సవ సభకు నేతల సన్నద్ధం

- ఉమ్మడి జిల్లా నుంచి భారీ ఎత్తున తరలింపునకు ఏర్పాట్లు
- 9 సెగ్మెంట్‌ల పరిధిలో 2,400 వాహనాలు
- 27న వరంగల్‌లో బీఆర్ఎస్ సభ



నిజామాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ఉమ్మడి జిల్లా నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎల్కతుర్తి వద్ద నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి నేతలు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు మొత్తం సభకు హాజరయ్యే విధంగా ఈ ఏర్పాట్లను చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల ద్వారా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ, మున్సిపల్, గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేసిన ప్రజాప్రతినిధులతో పాటు సీనియర్ నేతలు ఈ సభకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లను చేశారు. సొంత వాహనాలతో పాటు అద్దె వాహనాలను సమకూర్చుకుని వెళ్లేవిధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. సభకు వెళ్లడంతో పాటు క్యాడర్‌లో జోష్ నింపే విధంగా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత నిస్తేజంగా ఉన్న క్యాడర్‌ను ఇప్పటికే సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పాల్గొనే విధంగా చేస్తున్న నేతలు ఈ సభ ద్వారా పూర్తిస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించే విధంగా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు.

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో..

బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఈనెల 27 ఆదివారం హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరుగుతుంది. ఈ సభను 1300 ఎకరాల్లో నిర్వహిస్తుండగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్యాడర్ హాజరయ్యే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం క్యాడర్ హాజరయ్యే విధంగా నేతలు కసరత్తు చేశారు. గ్రామ, మండల స్థాయి నేతలతో మాట్లాడడంతో పాటు నియోజకవర్గాల వారీగా సమావేశాలను నిర్వహించారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, షకీల్, బిగాల గణేష్ గుప్త, సురేందర్, హన్మంత్ షిండే, గంప గోవర్ధన్‌తో పాటు ఇతర నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి, ముజీబుద్దీన్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులందరు ఈ సభ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా క్యాడర్‌ను తరలించేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 2400 వాహనాల ద్వారా తరలివెళ్లేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఇప్పటికే 250ఆర్టీసీ బస్సులు, 260 ప్రైవేట్ బస్సులతో పాటు ఇతర వాహనాలను బుక్ చేసుకున్నారు. వీటితో పాటు సొంత వాహనాల ద్వారా తరలించేందుకు సిద్ధమవుతున్నారు.

దిశానిర్దేశం చేయనున్న కేసీఆర్

వరంగల్ సభ కీలకం కావడం, రజతోత్సవం సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కీలక దిశానిర్దేశం చేయనుండడంతో ముఖ్యమైన క్యాడర్ అంతా హాజరయ్యే విధంగా నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి 5 వేలకు తగ్గకుండా క్యాడర్‌ను తరలించే విధంగా ఈ ఏర్పాట్లను చేశారు. వచ్చే స్థానిక సంస్థలపై దృష్టి పెట్టిన పార్టీ నేతలంతా ఈ సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ పాలనపై వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఈ సభ విజయవంతం కోసం ఉమ్మడి జిల్లా నేతలు గడిచిన కొన్ని రోజులుగా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. అన్ని నియోజక వర్గాల ప్రజల సభలు, సమావేశాలు పెట్టి క్యాడర్ హాజరయ్యే విధంగా ఈ చర్యలను తీసుకుంటున్నారు. పూర్తిస్థాయిలో సభను ఉపయోగించు కోవడంతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని క్యాడర్‌లో జోష్ పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో క్యాడర్ అంతా కదిలితే ఇబ్బందులు ఉండవని భావిస్తున్న నేతలు ముందస్తుగానే ఏర్పాట్లు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న నేతలు కూడా ఎక్కువ మొత్తంలో సమయం వెచ్చించి సభకు ఎక్కువ మంది క్యాడర్ తరలివెళ్లే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

భూభారతితో భూ సమస్యల సత్వర పరిష్కారం

- అవగాహన సదస్సులో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఇందల్వాయి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి ఆర్వో చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భూసమస్యల సత్వర పరిష్కారం భూభారతి చట్టం అని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలో రైతు వేదికలో నిర్వహించిన భూభారతి నూతన చట్టంపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలో పొందుపర్చిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా రైతులకు సంబంధించిన భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ నూతన ఆర్వో చట్టాన్ని తెచ్చిందన్నారు. భూమి హక్కుల భద్రత, భూసమస్యల పరిష్కారం, రైతుల మేలు కోసం చారిత్రక మార్పు దిశగా నూతన ఆర్వో చట్టం ఉపయోగపడుతుందని రైతుల భూములకు భరోసా కల్పిస్తుందన్నారు. భూసమస్యలు కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి వచ్చే ఇతర ఏ అంశాల సమస్యలను పరిశీలించి ఈ చట్టంలో చేర్చడం జరిగిందన్నారు. మే మొదటి వారంలో ప్రతీ జిల్లాలో ఒక మండలంలో ప్రయోగాత్మకంగా అమలు పరిపిన మీదట అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. అధికారులకు గ్రామాల నుండి వచ్చిన భూసమస్యల అర్జీలను స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతులు న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవో, కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. భూ వివాదాల విషయంలో అప్పీల్ చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం ప్రభుత్వమే సమకూరుస్తుందన్నారు. ఈ చట్టం ప్రవేశపెట్టిన ఏడాది కాలం లోపు భూసమస్యలపై అర్జీలు పెట్టుకునే అవకాశం కల్పించారని ఆన్‌లైన్‌లో ధరణి పోర్టల్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. భూసమస్యల పరిష్కారానికి రెండంచల వ్యవస్థ ఉందని రైతులకు భూముల వివరాలతో కూడిన భూదార్ కార్డులను కేటాయిస్తామన్నారు. వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర మిగతా అన్ని రకాల భూముల రికార్డులను రెవెన్యూ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయ పలు అంశాలపై రైతులకు కలెక్టర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కిరణ్‌కుమార్, ఇంచార్జి ఆర్డీవో స్రవంతి, తహశీల్దార్ వెంకట్‌రావు, ఎంపీడీవో అనంత్‌రావు, నవీన్‌గౌడ్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఏపీఎం సువర్ణ, రైతులు పాల్గొన్నారు.



- సిరికొండలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ

భూ భారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి (ఆర్ఓఆర్) చట్టంతో రైతులకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయని, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. సిరికొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన భూభారతి చట్టంపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. భూభారతి చట్టంలో పొందుపరిచిన అంశాల గురించి కలెక్టర్ రైతులకు విరించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందని కలెక్టర్ ఈ సందర్భంగా పలు అంశాలపై వివరించారు. ఇందులో నిజామాబాద్ ఆర్డీఓ స్రవంతి, సిరికొండ పీఏసీఎస్ అధ్యక్షులు చల్లెం గంగాధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ముత్తెన్న, సంపత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రవి, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



ఇందల్వాయిలో పాల్గొన్న రైతులు

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రోహిత్ రెడ్డి



రెంజల్‌లో టీకాలు వేస్తున్న దృశ్యం

రెంజల్,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): పశువులు కలిగిన ప్రతి ఒక్కరు ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రోహిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి పశువులకు సోకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు గాలికుంటు నివారణ టీకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ విఠల్, జూనియర్ పశువైద్యులు నాగరత్నం, గంగారాజు, నవీన్, లక్ష్మణ్, సావిత్రి, గోపాలమిత్రలు భాస్కర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : రైతులు తమ పశువులకు సకాలంలో గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రోహిత్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లక్కోర గ్రామంలో ఉచిత పశువైద్య గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ రోహిత్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది సురేష్, గంగాధర్, మౌలానా, బాబులాల్, గోపాలమిత్ర, గ్రామపాడి రైతులు పాల్గొన్నారు.

మాక్లూర్ : ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు డాక్టర్ కిరణ్ దేశ్‌పాండే, డాక్టర్ ఉమమసాహెద్ లు తెలిపారు. శుక్రవారం మధన్‌పల్లి మండలంలోని మధన్‌పల్లి క్యాంపు, మదన్‌పల్లి తాండ, సట్లాపూర్ తాండాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినిత, కళ్యాణి, షైమద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని సిరన్‌పల్లి, లింగాపూర్‌లలో శుక్రవారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందించారు. ఆయా గ్రామాలలోని తెలుపు, నలుపు జాతికి చెందిన 385పశువులకు ఈ టీకాలు అందించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, రవి, కోరే గంగాధర్ లున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ 33/11సబ్ స్టేషన్ మరమ్మత్తుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏడీఈ అశోక్ తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు సంబంధిత సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఈ విషయంలో వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

వర్ని,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ ఏజాస్ అన్నారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో జరిగే సభను వర్ని మండల పరిధిలోని ఉన్న అన్ని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ఏజాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ యాదవ్, జంగం రాచప్ప, షేక్ ఉస్మాన్, ప్రభాకర్, ఆనంద్ గౌడ్, మహేందర్ రెడ్డి, గైని లక్ష్మణ్, రాజేష్, జిశాన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో లెక్చరర్ల ప్రచారం

మోర్తాడ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం ప్రిన్సిపాల్ డాక్టర్ టి. పెద్దన్న ఆదేశాల మేరకు లెక్చరర్లు నాలుగు బృందాలుగా ఏర్పడి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన స్థలాల వద్ద పోస్టర్లు అతికించారు. బ్యానర్లు కట్టారు. విద్యార్థులను కలిసి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని కోరారు. ప్రతీ గ్రామంలో మైక్‌ద్వారా ప్రచారం నిర్వహించారు. ఉచిత అడ్మిషన్, స్కాలర్‌షిప్, బస్‌పాస్, ప్రభుత్వ ఉద్యోగ కోచింగ్ నిర్వహించబడుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మర్రిపల్లి భూపతి, కోఆర్డినేటర్ దశరథ, రవీందర్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్, టైలరింగ్‌ల శిక్షణ కేంద్రాలు ప్రారంభం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ దుర్గాబాయి మహిళ శిశువికాస కేంద్రంలో శుక్రవారం కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ కేంద్రాలను మహిళ కమీషన్ మెంబర్ సూదంలక్ష్మీ జిల్లా సంక్షేమశాఖ అధికారిని రసూల్ బీబి ప్రారంభించినట్లు జిల్లా అధికారిణి పి. ఇంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలరింగ్, కంప్యూటర్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఆదాయవనరులు ఏర్పర్చుకోగలుగుతారని వారు అన్నారు. అనంతరం మహిళలు శిశువుల భద్రత కోసం 1098, 181 కాల్ సెంటర్ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సిడిపివో భార్గవి, సిబ్బంది రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరాంపూర్ వీడీసీ ని రద్దు చేయాలని ధర్నా



ఆర్డీవో కార్యాయం ఎదుట మాట్లాడుతున్న నాయకులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): తాళ్లరాంపూర్ విడిసి ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బీసీల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ గతకొన్ని రోజుల క్రితం తాళ్లరాంపూర్ గ్రామంలో గీతా కార్మికులను వీడీసీ సభ్యులను బహిష్కరించారని, ఇంతవరకు వీడీసీ సభ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ గ్రాడ్యుయేట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అబ్బగోని అశోక్‌గౌడ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిసీడ దశరత్, బీసీ గ్రాడ్యుయేట్ ఫోరం ఆదిలాబాద్ అధ్యక్షుడు అంబదాస్, జిల్లా అధ్యక్షుడు సురేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పడిగెల బాల్‌రాజ్ మాట్లాడుతూ తాళ్లరాంపూర్ ఘటన రాష్ట్ర బీసీకులాల్లో మార్పురావాలని అన్నారు. గతంలో గంగపుత్ర, ముదిరాజ్, యాదవ, రజక, మున్నూర్ కాపు తదితర కులాలను బహిష్కరించారని వీడీసీలు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు.

ఉగ్రదాడిపై అంతటా నిరసనలు



ఆర్మూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బార్ కౌన్సిల్ సభ్యులు

పెర్కిట్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహాల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రతీ భారతీయులు ఖండించాలని పహాల్గాంలో వీరమరణం పొందిన భారతీయులకు నివాళులు అర్పిస్తు ఆర్మూర్ పట్టణంలో విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కొవ్వొత్తుల ర్యాలీ శివాజీచౌక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఉగ్రదాడికి నిరసనగా పాకిస్తాన్ దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, విశ్వహిందుపరిషత్, భజరందళ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ఆర్మూర్ టౌన్ : పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇటీవల జమ్ముకాశ్మీర్‌లో పహాల్గాంలో జరిగిన ఉగ్రదాడి సంఘటనతో రాష్ట్ర బార్ కౌన్సిల్ పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేయడం వారు తీవ్రంగా ఖండించారు. అలాంటి ఉగ్రదాడులను వెంటడి, వేటాడి శిక్షించవల్సిన అవసరం భారతదేశ ప్రభుత్వంపై ఉందని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కఠినమైన చట్టాలు చేస్తూ నియంత్రించి ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్; ఉపాధ్యక్షుడు గట్టడి ఆనంద్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, కోశాధికారి చైతన్య, శ్రావణ్, ఏజీపీ చిన్నారెడ్డి, తెడ్డు నర్సయ్య, దేవన్న, జీవన్, ప్రవీన్‌చందర్, గోవిందరాజు, బబ్లుపాల్, బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : జమ్ముకాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని వేల్పూర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో అమరులైన వారికి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. అసువులుబాసిన వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని కోరారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, దీన్ని ప్రతీ భారత పౌరుడు ఖండించాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ మండల అంబేద్కర్, యువజన సంఘం అధ్యక్షులు, సంఘం సభ్యులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : జమ్ముకాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడులకు నిరసనగా శుక్రావారం హిందుసంఘాల ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా కమ్మర్‌పల్లి బంద్ సక్సెస్ అయింది. శుక్రవారం దుకాణదారులు, వ్యాపారవేత్తలు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన తెలిపారు. కాగా ఉదయం స్థానిక భరతమాత విగ్రహంవద్ద హిందుసంఘాల సభ్యులు మానవహారంగా ఏర్పడి అమరులైన టూరిస్టులకు ఘనంగ నివాళులర్పించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, ఆమెడ నరేందర్, రమణయ్య, బద్రి, రేగుంట దేవేందర్, రాజశేఖర్, ప్రవీన్ పాల్గొన్నారు. జమ్ముకాశ్మీర్ పహల్గావ్ ఉగ్రదాడులకు నిరసనగా శుక్రావారం నమాజ్ అనంతరం స్థానిక జామ మజీద్ ఎదురుగా పాకిస్తాన్, ఉగ్రముఖల దిష్టిబొమ్మను దహనం చేసి ఉగ్రముకల దాడిలో అసువులుబాసిన టూరిస్టులకు నివాళలర్పించారు. ఉగ్రదాడులకు పాల్పడినవారిని గుర్తించి ఉరితీయాలని నినాదాలు చేశారు. ఇస్లాంమతం సర్వదా శాంతినే కోరుకుంటుందని మజీద్ కమిటీ అధ్యక్షుడు హుసేన్ అన్నారు.

నేడు భీమ్‌గల్ బంద్

భీమ్‌గల్ : విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో బందుకు పిలుపునిచ్చారు. కులాలను పక్కన బెట్టి హిందువులు బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. బందులో వ్యాపారస్తులు, ప్రజలు పాల్గొని సహాకరించాలని విశ్వహిందు పరిషత్ భీమ్‌గల్ పట్టణ శాఖ కోరింది.

వర్ని : పహల్గాం ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత పౌరులకు మౌనం పాటిస్తూ వర్ని మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం నుండి సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వరకు ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల ముస్లిం సోదరులు మౌనంపాటించారు. ఇస్లాం ఎన్నటికి ఇలాంటి చర్యలను అంగీకరించదని ఈ దాడికి పాల్పడిన ముష్కరులను శిక్షించాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. హిందు ముస్లింలు అంత ఒక్కటేనని పేర్కొన్నారు.

బోధన్‌రూరల్ : పాకిస్థాన్ దేశానికి భారత దేశం గుణపాఠం చెప్పాలని, దెబ్బకు దెబ్బ కొట్టి ఉగ్రమూకలను హతమార్చాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారికి శాంతిచేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రమూకలను పట్టుకుని హతమార్చాలని పేర్కొన్నారు. పాకిస్థాన్ దేశానికి భారత దేశం గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోకల గంగారెడ్డి, గుమ్ముల అశోక్ రెడ్డి, నక్క లింగారెడ్డి, రజాక్, అశ్వక్, పెరక రామకృష్ణ, రవి శంకర్ గౌడ్, ఎన్ఆర్ఐ హైమద్, విద్యాసాగర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి



పెద్ద మల్లుగొండ (ఫైల్)

రెంజల్,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపం గత మూడు రోజుల నుంచి దగదగమనడంతో ఎండ తీవ్రతలు అధికమయ్యాయి. బయటకు వెళ్లాలంటేనే భయం గుప్పిట్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రోజుమాదిరిగా గొర్రెలను కాచేందుకు వెళ్లిన మల్లుగొండ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మండలంలోని బాగేపల్లి గ్రామానికి చెందిన పినిగిరి పెద్ద మల్లుగొండ అనే గొర్రెల కాపరి వడదెబ్బ తగిలి మృతిచెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న మల్లుగొండ మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఎండలు అధికంగా ఉండడంతో రోజు మాదిరిగా గొర్రెలను కాచేందుకు మల్లుగొండ గొర్లు ఇంటికి వచ్చిన కూడా మల్లుగొండ ఇంటికి రావడంతో కుటుంబసభ్యులు మల్లుగొండ ఆచూకీ వెతకగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గొర్రెలను తీసుకుని రాగా అక్కడికక్కడే ఎండ వేడిమి తట్టుకోలేక అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామస్థులు మల్లుగొండ మృతదేహన్ని ఇంటికి తీసుకువచ్చారు. మల్లుగొండ గొర్రెలను కాస్తూ జీవనం సాగిస్తూ ఉండేవని అన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బతో మృతి చెందడంతో గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పనులు అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలి

● డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్



మాట్లాడుతున్న అధికారులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పనులు అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో ఉపాధిహామీ పథకం పనులపై 16వ విడత మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. ఈ సమావేశానికి పీడీసీ సాయాగౌడ్ హాజరై మాట్లాడారు. పనుల కోసం వచ్చే కూలీలకు జాబ్‌కార్డులు లేకపోతే జాబ్‌కార్డులు ఇప్పించాలని సూచించారు. అనంతరం మండలంలోని 21 గ్రామాలలో గడిచిన ఏడాదిలో ఉపాధిహామి పథకం పనులపై సామాజిక తినిఖీ ప్రజావేదికలో గ్రామస్థాయి తనిఖీ బృందం సభ్యులు కూలీలు చేసిన పనుల వివరాలను గ్రామాలవారిగా చదివి వినిపించారు. ఉపాధిహామీ పనులకు రాకున్న కూలీలకు డబ్బులు చెల్లించారని, పనులకు రాకున్న వచ్చినట్లు మాస్టర్‌లో కూలీలకు హాజరువేసి వారికి కూలీ డబ్బులు చెల్లించారని గ్రామస్థాయి తనిఖీ బృందం సభ్యులు సామాజిక తనిఖీ ప్రజావేదికలో చదివి వినిపించారు. పుప్పాలపల్లి, గన్యతాండా, సికింద్రాపూర్ గ్రామాలలో పనులు చేయకుండానే కూలీలకు మాస్టర్లలో హాజరు వేసి డబ్బులు చెల్లించారని గ్రామ తనిఖీ సభ్యులు చదివి వినిపించారు. పనులు చేయకుండా డబ్బులు తీసుకున్న కూలీల నుంచి తిరిగి ఆ డబ్బులను రికవరి చేయాలని ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పీడీ సాయాగౌడ్ ఆదేశించారు. గ్రామాల్లో మొక్కలు నాటగా సగం వరకు ఎండిపోయాయని తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో చదువుగా ఎండిపోయిన వాటిస్థానంలో కొత్తగా మొక్కలు నాటించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. వివిధ గ్రామాలలో ఒకే కుటుంబంలో రెండు చొప్పున జాబ్‌కార్డులు ఉన్నాయని ఈ జాబ్‌కార్డులపై కుటుంబ సభ్యులు పను లు చేశారని, కూలీ డబ్బులు చెల్లిం చారని ప్రజావేదికలో గ్రామ తనిఖీ బృం దం సభ్యులు తెలుపగా ఒక్క కుటుం బంలో ఒకే జాబ్‌కార్డుపై పనులు చేయాలని అధికారులు సూచించారు. రెండో జాబ్‌కార్డుపై పనిచేసిన ఆ కూలీ డబ్బులను రికవరీ చేయాలని ఆ గ్రామ ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు పీడీ ఆదేశించారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి నారాయణ, యస్ఆర్‌పీ రవి, ఎంపీడీవో సతీష్‌కుమార్, పీఆర్‌ఏఈ సురేంద్రవర్మ, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌రెడ్డి

ముప్కాల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మడలం నాగంపేట్ గ్రామానికి చెందిన ఏలేటి గంగాధర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో శుక్రవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఎలుగుబంటి దాడిలో మహిళకు గాయాలు

భీమ్‌గల్ రూరల్ , ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండలం కొత్తతాండ గ్రామ పంచాయితీ పరిధిలో శుక్రవారం ఎలుగుబంటి దాడిలో మహిళకు గాయాలయ్యాయి. బుక్య మంజులా అనే మహిళ ఉదయం గ్రామ శివారులో తూనికాకు సేకరణకు వెళ్లగా వెనుకనుంచి వచ్చిన ఎలుగుబంటి ఆమెపై దాడిచేసి గాయపరిచింది. పక్కనే ఉన్న కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో ఎలుగుబంటి అటవి ప్రాంతంలోకి వెళ్లిపోయింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం భీమ్‌గల్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఆర్మూర్‌లోని ప్రైయివేట్ ఆసుపత్రికి తరలించారు.

ఆర్మూర్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లో శుక్రవారం రాత్రి పోలీసులు జాగిలాలచే తనిఖీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ తో పాటు సైకిల్ స్టాండ్ ఇతర ప్రాంతాలలో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

మోస్రా,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు తట్టుకోలేక మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మోస్రాలో నెలకొంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం మోస్రా మండల కేంద్రానికి చెందిన కుమ్మరి గంగారాం ఒక పెట్రోల్ బంక్‌లో పని చేస్తుండగా అవసరం నిమిత్తం అప్పులు చేసి అప్పులు తీర్చుకోలేక ఎలా తీర్చాలనే మనస్థాపం చెందిన గురువారం నాడు గ్రామ పెద్చార చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసఇ శవపరీక్ష నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ మహేష్ తెలిపారు.

హంగర్గలో అంబేద్కర్ జయంతి

కోటగిరి,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలు కొనియాడారు. అనంతరం కాలనీలో యువత డీజే ఆటపాటలతో కొలాటాల మధ్య అంబేద్కర్ చిత్రపటంతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కోటగిరి,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): కోటగిరి శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజవ్వ(56)అనే వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. జుక్కల్ మండలంలోని కేమ్‌రాజ్ కల్లాలి గ్రామానికి చెందిన అంజవ్వ పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో గురువారం జరిగిన పెళ్లికి వచ్చింది. అనంతరం రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా కోటగిరి శివారులో కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భర్త బలరాం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ఆలూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలంలోని మిర్ధాపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎంపీడీవో గంగాధర్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో 127 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు కాగా పునాదుల దశో మరికొన్ని పిల్లర్ల దశలో ఉన్నాయి. ఇండ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నవీన్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో ఇంటర్ దరఖాస్తుల స్వీకరణ

ముప్కాల్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకుల కళాశాలలో 2025-26 సంవత్సరం కు గాను ప్రవేశాలకు ఈనెల 25 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ముప్కాల్ మండల విద్యాధికారి రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్ ద్వారా ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఒకేషనల్ కోర్సులలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

చలివేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



చలివేంద్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం పరిశీలించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మంచినీటిని ఎల్లవేళల అందుబాటులో ఉంచాలని పట్టణ ప్రజలు, ప్రయాణీకులు చలివేంద్రాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, చలివేంద్ర ఇన్‌చార్జి సురేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా వ్యాధి నివారణకు కృషి చేయాలి



నవీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది

నవీపేట,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వచ్చే 2030లోగా దోమల నివారణతో పాటు మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు కావ్య, ప్రవళిక, ఎంపీహెచ్‌వో వెంకటేశ్వర్ రావు, సూపర్‌వైజర్ కిషన్, గోదావరి, వినయ కుమారి, పుష్ప, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోస్రా : మండల కేంద్రంలో ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి మండల కేంద్రంలో మలేరియాకు సంబంధించినటువంటి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ్ మాట్లాడుతూ ఇంటి, దుకాణ సముదాయాల చుట్టు పక్కన నీళ్లు నిల్వకుండా జాగ్రత్త పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీ పీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వచ్చే 2030లోగా దోమల నివారణతో పాటు మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అలీమొద్దీన్, సూపర్‌వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతీఇంట శుభ్రతను పాటించాలని, నీటి నిల్వలు ఉండకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్త వహించాలని, దోమలు ఉత్పత్తికాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియకు గుడ్‌బై చెబుదాం అంటు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఫిర్దోస్ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ సాయి, ఆనంద్, సురేష్, కృష్ణ, ఏఎన్ఎంలు రాజవ్వ, విజయ, సౌందర్య, స్వాతి, విజయశ్రీ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కోటగిరి,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కల్లూర్, కొడిచర్ల గ్రామాలలో శుక్రవారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో చందర్ పరిశీలించారు. చెరువుల్లో ఫిష్ పాండ్స్ పనులను పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి



బాన్సువాడలో పోచారానికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

కోటగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో వ్యవసాయ కళాశాల(బీఎస్సీ అగ్రికల్చర్) హాస్టల్స్, జూనియర్ కళాశాలలను మంజూరు చేయాలని రుద్రూరు ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రైడ్స్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో రైడ్స్ అధ్యక్షులు కృష్ణ ప్రసాద్, కార్యదర్శి శేఖర్, కోశాధికారి మహిపాల్, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థిని సన్మానించిన పాఠశాల యాజమాన్యం

ఎడపల్లి, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన తమ పూర్వ విద్యార్థిని గోఫూర్ మహితను శుక్రవారం శ్రీ మాధవీ హైస్కూల్ పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ గౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో మహిత తల్లిదండ్రులు గోఫూర్ సాయరెడ్డి, మం జుల, సోదరి అక్షయ, పాఠశాల ఉపాధ్యాయులు మాధవి ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మోస్రా,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు తట్టుకోలేక మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మోస్రాలో నెలకొంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం మోస్రా మండల కేంద్రానికి చెందిన కుమ్మరి గంగారాం పెట్రోల్ బంక్‌లో పని చేస్తుండేవాడు. అవసరం నిమిత్తం చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపం చెందిన గురువారం గ్రామ పెచ్చార చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవపరీక్ష నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ మహేష్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

రెంజల్,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో ఒకరి జైలు శిక్ష పడింది. మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించగా నీలా గ్రామానికి షేక్ అక్బర్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనాన్ని నడపడంతో ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేశారు. బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

వేసవికాలం అప్రమత్తంగా ఉండాలి

నవీపేట,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ప్రజలు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వినయ్ కోరారు. వేసవికాలం కావడంతో పలువురు ఉక్కపోత భరించలేక రాత్రి వేళలో ఇంటి ఆవరణలో గాని ఇంటి దాబాల పైన పడుకుంటారని, ఇటువంటి సమయంలో దొంగలు ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను ఎత్తుకుపోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇళ్లలో ఉన్న విలువైన వస్తువులను బీరువా, ఇతర అల్మారలో కాకుండా ఎవరు గుర్తించని ప్రదేశాలలో పెట్టుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

గోపాలమిత్రల గోస తీరేదెన్నడో..!?

● చాలీచాలని పారితోషికాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న గోపాలమిత్రలు

సదాశివనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాలలో మేలు జాతి పశువుల ఉత్పత్తికి కృషి చేస్తున్న గోపాలమిత్రలకు కష్టాలే తప్ప ఏమీ మిగలడం లేదని జిల్లాలోని గోపాల మిత్రలు వాపోతున్నారు. సుమారు 30 సంవత్సరాల క్రితం పశుగణన ఆధారంగా మండలానికి ముగ్గురు లేదా నలుగురు చొప్పున ప్రభుత్వం గోపాల మిత్రలను నియమించింది. గ్రామీణ ప్రాంత పశువులకు మేలు జాతి వీర్యాన్ని ప్రభుత్వం సేకరించి సంబంధిత పశువైద్యశాలల నుంచి గోపాల మిత్రలకు కంటైనర్ ద్వారా సరఫరాచేసి గ్రామీణ ప్రాంతాల్లో సంకర జాతి పశువులను ఉత్పత్తి చేయడమే గోపాల మిత్రల ఏకైక లక్ష్యంగా ప్రభుత్వం నియమించింది. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం అందక పోవడంతో వైద్యుల సహాయంలో గోపాలమిత్రలు పశు వైద్యులుగా అన్ని వ్యాధులకు చికిత్సలు నిర్వహిస్తూ వస్తున్నారు.



గేదెలకు గర్భధారణ చేయిస్తున్న గోపాలమిత్రలు

కృత్రిమ గర్భధారణ గోపాలమిత్రలకు ఏకైక లక్ష్యం

జిల్లాలో 58 మంది గోపాలమిత్రలు నియమించిన ప్రభుత్వం ఒక్కొక్కరు 1180 కృత్రిమ గర్భధారణ చేయాల్సి ఉంటుంది. వీర్యకణాల స్ట్రాలకు ఒక్కోదాని రూ.40 ప్రభుత్వానికి గోపాల మిత్రలు గతంలో చెల్లించాల్సి ఉండేది. గ్రామీణ ప్రాంతాలలోని స్థానిక జాతి గేదెలు, ఆవులలో సంకరజాతి నాణ్యమైన గేదెలు, ఆవులను పాల ఉత్పత్తిని పెంచడానికి దృష్టిలో ఉంచుకుని ఈ గర్భధారణ కార్యక్రమాన్ని గతంలో ప్రభుత్వాలు చేపట్టాయి. గోపాల మిత్రలు కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం నెలకు 11050 ఇన్సెంటివ్ కింద ప్రకటించి చెల్లించారు. గోపాలమిత్రలు ఉపాధి కోసం ఉదయం నుండి క్షేత్రస్థాయిలో కృత్రిమ గర్భధారణ సాధారణ పశు చికిత్సలతో పాటు ప్రభుత్వ పశువైద్యాధికారులకు, సిబ్బందికి సహాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 8 నెలల నుంచి ప్రోత్సాహకం అందడం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన 11050 ప్రోత్సహకం ప్రతినెల క్రమం తప్పకుండా రాకపోవడంతో గోపాలమిత్రలు కుటుంబాలు పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. గత 8 నెలల నుంచి ప్రోత్సహకాలు విడుదల కాకపోవడంతో గోపాలమిత్రలు ప్రోత్సాహకం ఎప్పుడు అందుతుందో తెలియక సతమవతవుతునే ఉన్నారు.

వీర్య కణాల స్ట్రాలను ప్రభుత్వం అందిస్తుంది

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న గోపాలమిత్రలు వీర్యకణాల స్ట్రాలను కొనుగోలు చేయలేని పరిస్థితి ఒక్కోసారి ఎదురవుతుండడంతో ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని వీర్యకణాల స్ట్రలాలను గోపాలమిత్రలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా అందిస్తున్నారు. దీనికి సంబంధించి కంటైనర్ కూడా అందించడలో పశువుల ఎద సమయంలో ఉన్నప్పుడు పశుపోషకులు పాడి రైతులు గోపాలమిత్రలకు ఫోన్ చేయడం ద్వారా అక్కడికి వెళ్లి పశువులకు కృత్రిమ గర్భధారణ చేస్తున్నారు.



పశు వైద్య శిబిరంలో సహాయం చేస్తున్న గోపాలమిత్రలు

నెలనెలా ఇన్సెంటివ్ అందించాలి

● మహిపాల్‌రెడ్డి, గోపాలమిత్ర

ప్రభుత్వం ప్రకటించిన పారితోషికం నెలనెలా అందకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం 8 నెలల నుంచి పారితోషికాలు అందించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పెండింగ్‌లో ఉన్న పారితోషకాలను విడుదల చేసి నెల నెలా క్రమం తప్పకుండా ఇన్సెంటివ్‌లు ఇవ్వాలి.



ఇన్‌చార్జి ఆర్‌డీవోకు సమస్యలు విన్నవిస్తున్న దృశ్యం(ఫైల్)

సమస్యలు చెప్పినా పట్టింపు కరువు!

● అంధకారంలో డబుల్ గృహాలు

ఇందల్వాయి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పట్టించుకోమని ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా సమస్యలను పట్టిం చుకునే వారే కరువయ్యారని ఇందల్వాయి డబుల్ ఇళ్ల లబ్ధి దారులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ లేక అల్లాడుతున్నామని అధికారులకు ఎన్నోసార్లు చెప్పిన పట్టింపు కరువైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు విచ్చేసిన ఇన్‌చార్జి ఆర్‌డీవో ప్రవంతికి గోడు చెప్పుకున్నారు. డబుల్ ఇళ్లలో 48 కుటుంబాలు నివసిస్తున్నామని ఇళ్లు మంజూరు చేసి ఏళ్లు గడుస్తు న్నా నాటి నుంచి నేటి వరకు ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయని లబ్ధిదారులు ఆవేదన చెందుతూ ఇన్‌చార్జి ఆర్‌డీవోకు విన్నవించారు. తాగునీరు, డ్రైనేజీ నిర్మాణా లు చేపట్టాలని విన్నవించారు. దీంతో ఆర్‌డీవో డబుల్ ఇళ్లకు వెళ్లి స్వయంగా పరిశీలించారు. ప్రజల సమస్యలను లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల వినూత్న నిరసన



భిక్కనూరు టీయూ సౌత్‌క్యాంపస్‌లో ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ కాంట్రాక్ట అధ్యాపకులు డిమాండ్ చేశారు. సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం ఏడవరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఒంటికాలుపై నిలబడి వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత చాలా సంవత్సరాలుగా యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల ముందు కాంట్రాక్ట్ అధ్యాప కులకు ఇచ్చిన న్యాయ మైన హామీలను నేరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యా పకులు నారాయణ, యాలాద్రి, సునీత, నర్సయ్య, నిరంజన్, శ్రీకాంత్, వైశాలీ, తదితరులు పాల్గొన్నారు.

నాల్గో రోజుకు చేరుకున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమ్మె..

భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పార్ట్‌టైం అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు పీహెచ్‌డీ, నెట్, సెట్ పట్టాలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయమైన తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించేంత వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవు

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో నీటి సరఫరాలో డబ్బులు డిమాండ్ చేయ్యడం పట్ల శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన పైసల్ కొట్టు నీళ్లు పట్టు అనే కథనానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి స్పందించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వార్డు అధికారులు, వాల్ ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 49 వార్డులలో తాగునీటి సమస్య రావోద్దని, ఎక్కడా సమస్య ఉన్న ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. ప్రజలకు నీటి సరఫరా చేసే సమయంలో డబ్బులు వసూళ్లు చేయరాదని ఒకవేళ అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వార్డు ఆఫీసర్లు తమ వార్డుల్లో నీటి అవ సరాలపై ఎప్పటికప్పుడు పర్యావేక్షణ చేయాలని సూచించారు. ఏ వార్డులో నీటి సమస్య ఉందని ఫిర్యాదు వచ్చిన ఆ వార్డు అధికారే బాధ్యత వహించాల్సి ఉం టుందని తెలిపారు. సామాన్య ప్రజలకు ఎలా నీటి సరఫరా చేస్తున్నామో మాజీ ప్రజాప్రతినిధులకు, రాజకీయ నాయకులకు, అధికారులకు సైతం అలా నే నీటిని సరఫరా చేయాలని తెలిపారు. అలా కాదని వారి సంపుల్లో నీటిని పోస్తున్నవారిపై కఠిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు.



శిక్షణలో పాల్గొన్న బాలికలు



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ

ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకే ఫ్రీ సమ్మర్ క్యాంప్

● సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకే ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 2 వరకు వారం రోజుల పాటు ఆర్మూర్ రోడ్‌లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిబిరాన్ని శుక్రవారం సీపీ సాయిచైతన్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని చదువులకు సమ్మర్ క్యాంప్‌లకు చాలా తేడా ఉంటుందని ఈ క్యాంప్ ముఖ్య ఉద్ధేశం విద్యార్థినులు ఎలా ఉండాలి.. ఎలా చదువు కోవాలి.. ఎలా భవిష్యత్తులో ముందుకెళ్లాలి.. ఏదైనా సమస్య ఉంటే ఎలా ఎదుర్కోవాలి అనే ప్రతీ ఒక్క అంశంపై క్లుప్తంగా బాలికలకు వివరించడం జరుగుతుందన్నారు. విద్యార్థినులకు ముఖ్యంగా ఆడపిల్లలకు ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందించడం, నేరాల పట్ల అవగాహన కల్పించడం శిబిరంలో వారు తమకు తాము రక్షిం చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను, ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై శిక్షణ పొందుతారని అన్నారు. ఈ శిబిరం విద్యార్థులలో ఆత్మస్థైర్యం పెంచుతుందని వారు సమాజంలో ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో జీవించగలిగేలా చేస్తుందన్నారు. శిబిరంలో విద్యార్థినులకు నేరాల నుంచి ఎలా దూరంగా ఉండాలో వాటిని ఎలా ఎదుర్కో వచ్చో తెలియజేస్తామన్నారు. శిబిరంలో మహిళలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించడంతో పాటు ఎలా నేరాల నుంచి రక్షించుకోవచ్చో, ఆత్మస్థైర్యంతో ఎలా బతకాలో నేర్పుతామన్నారు. ఈ శిబిరంలో సెల్ఫ్ మోటివేషన్ తరగతులు ఉంటాయని ఈ శిబిరానికి వచ్చిన విద్యార్థినులకు ప్రోత్సహిస్తున్న తలిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. మొదట ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు తైక్వాండో ట్రైనర్ మనోజ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలకు, ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో తమను తాము రక్షించుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ ఎలా చేసుకోవాలో శిక్షణ ఇచ్చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ విశాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ మోజులో పడి యువత ఎలా చెడు దారులు పడుతున్నారో, ఎలా వ్యసనాలకు అలవాటు పడుతున్నారో వివరించారు. మోటివేషనల్ స్పీకర్ శ్రీహరి మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు ఎలా ఉండాలో మెలకువలు నేర్పించారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు రేపటి వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సాయి కిరణ్, సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, యోగా మాస్టర్ కిషన్, తైక్వాండో ట్రైనర్ మనోజ్, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సివిల్ ర్యాంకర్‌ను అభినందిస్తున్న సీపీ

సివిల్ ర్యాంకర్‌ను అభినందించిన సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాలలో జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ జె.గోవింద్ రావు కుమారుడు జె.సాయిచైతన్య యూపీఎస్‌సీలో 68వ ర్యాంకు సాధించడంతో శుక్రవారం సీపీ సాయిచైతన్య హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు సివిల్ ర్యాంకర్‌ను అభినందించారు. పోలీస్ క్యాంప్ కార్యాలయంలో సివిల్ ర్యాంకర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన తండ్రి హెడ్‌కానిస్టేబుల్‌ను కూడా అభినందించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ తమ పిల్లలను చక్కని చదువులు చదివించి ఉన్నతస్థాయి అధికారులను చేయడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో సిబ్బంది ప్రతీ ఒక్కరు తమ పిల్లలను ఉన్నతస్థాయి చదువులు చదివించి భవిష్యత్తును చక్కని మార్గంలో పెట్టేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ మల్లేష్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, తిరుపతి, పోలీస్ అసోసియేషన్ ప్రసిడెంట్ షకీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులను పరుగులు పెట్టించిన ఈదురు గాలులు



దోమకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు పడడంతో రైతులు ధాన్యం కుప్పలపై టార్పాలిన్‌లు కప్పి ఉంచారు. ఈదరుగాలులకు కవర్లు కొట్టుకపోకుండా వాటిపై రాళ్లు పెట్టారు. గొట్టిముక్కుల గ్రామంలోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో సుమారు గంట పాటు ఈదురు గాలులు వీచాయి. దీంతో రైతులు పరుగులు పేడుతూ తమ వరి ధాన్యాన్ని రాశులు చేసి తార్పాలిన్ కవర్లు కప్పి ఉంచారు.

మలేరియా వ్యాధిపై అవగాహన



డోంగ్లిలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

మద్నూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మలేరియా అంటేనే వణికిపోయేవారు ఏ చిన్న జ్వరం వచ్చిన వైద్యులు ముందుగా మలేరియా టెస్టు చేసేవారు. అందులో నెగిటివ్ ఉందంటే సరే పాజిటివ్ వచ్చిందంటే ఇక హడలే కొద్దిపాటి నిర్లక్ష్యం వహించిన ప్రాణాలకే ముప్పు ఉండేది కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయిందని డోంగ్లి పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మలేరియా వ్యతిరేక దినం పురస్కరించుకొని మండల కేంద్రంలో ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకోవడంతో మలేరియా తగ్గుముఖం పట్టిందని అన్నారు. అనఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి సోకుతుందని జ్వరం, నీరసం, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది స్వల్ప ఇన్ఫెక్షన్లు ఈ వ్యాధి లక్షణాలని గుర్తు చేశారు. మలేరియా వ్యాధి ప్రధానంగా నవంబర్, డిసెంబర్, జనవరి నెలలో ప్రధానంగా ఉంటుందని ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణీలు, హెచ్‌ఐవీ ఎయిడ్స్ బాధితులకు వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. మురికి నీళ్లు నిలువ ఉండే ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సు మంజుల, ఏఎన్‌ఎం నాగమణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు

ఎల్లారెడ్డిరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి దాదాపు 15 రోజులు గడుస్తున్నా ఇంకా ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సన్నవరిధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తుందని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతుల సంఖ్య మరింత పెరుగుతుంది. కాని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ చాలా చోట్ల మొదలుకాకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామంలో ఇటీవల కొనుగోలు కేంద్రం ప్రారంభించి రోజులు గడుస్తున్నా ఇంకా కొనుగోలు ప్రక్రియ కొనసాగకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో అన్నసాగర్, వెల్లుట్లపేట, ఆజామాబాద్ తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి కొనుగోలులో జాప్యం చేస్తున్నారని రైతులుపేర్కొంటున్నారు. మార్కెట్‌లో ప్రైవేట్ మిల్లర్లు, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలుచేస్తున్నారని, రైతులు ప్రభు త్వ కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. కాని ఇక్కడ రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఎండవాన లెక్కచేయకుండా కాపాల ఉండాల్సి పరిస్థితి ఎదురవుతుంది. మిశ్రమ వాతావరణంతో రైతుల్లో ఆందోళన నెలకొంటుంది. ఐకేపీ సిబ్బంది మాత్రం హమా లీల కొరత వల్ల ఆలస్యం అవుతుందని సమాధానం చెబుతున్నా ర ని ఇలా అయితే అకాలవర్షాలు పడి ధాన్యం తడిసిపోతే మా పరి స్థితి ఎంటని ప్రశ్నిస్తున్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబెడుతున్న రైతులు

కొనుగోలు మాత్రం చేపట్టడం లేదు

● శ్రీనివాస్‌రెడ్డి, రైతు



కొనుగోలు కేంద్రం త్వరగా ప్రారంభించడంతో త్వరగా ధాన్యం అవుతుందని ఆశించాం. కాని ఇంకా హమాలీలు లేరని అధికారులు చెబుతుండడంతో నిరాశకు గురవుతున్నాం. అకాల వర్షాలు పడుతుండడంతో ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.

అంగరంగ వైభవంగా హనుమాన్ కల్యాణ మహోత్సవం

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్‌కాలనీలో గల శ్రీశ్రీశ్రీ ఇష్ట కార్యసిద్ధి అంజనేయ స్వామి దేవాలయంలో సువర్చల సహిత హనుమాన్ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు అందించి, హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారికి అభిషేకం, హోమం, అలంకరణ, అర్చన, హారతి, తీర్థ ప్రసాద స్వీకరణ, పల్లకిసేవ భజన కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

కందకుర్తిలో హనుమాన్ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

రెంజల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం నది ఒడ్డున ఉన్న సీతారాం ధాం సంత్ ఆశ్రమంలో మే 19 నుంచి 27వ తేదీ వరకు చండీయాగం, భగవద్గీత కార్యక్రమాల నిర్వహణ కొరకు యజ్ఞ యాగాలు నిర్వహించడం కోసం శుక్రవారం అయోధ్య సీతారాం త్యాగి మహరాజ్ ఆధ్వర్యంలో హనుమాన్ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందకుర్తి గ్రామస్థులు రమేష్, యోగేష్, గోవింద్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న సీతారాం త్యాగి మహరాజ్

'పరిసరాల పరిశుభ్రత పాటించాలి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమల నివారణే అందరి లక్ష్యం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని దుబ్బ పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లాస్థాయి ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారం భించారు. ఈ సందర్భంగా దుబ్బ ప్రాంతంలో దోమల నివారణపై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం దుబ్బ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లా డారు. దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరి యా, మెదడువాపు వంటి వ్యాధులను అరికట్టాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశలు ప్రతిరోజు గృహ సందర్శనలో ఏ రకమైన జ్వరం అయినా రక్తనమూనాలు సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలన్నారు.

రెడ్‌క్రాస్ సేవలకు జాతీయ స్థాయి అవార్డు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి మరోసారి జాతీయ స్థాయి పురస్కారం లభించింది. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోటరాజశేఖర్ విశిష్టత సేవలకు గాను రెడ్‌క్రాస్ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. 2023-24 సంవత్సరానికి గాను ఈ అవార్డుకు ఆయన ఎంపిక కాగా మే 13న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. తోటరాజశేఖర్ రెడ్‌క్రాస్ ద్వారా అనేక సేవలను చేస్తూ అందరికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాడు. జాతీయ స్థాయిలో ఆరుగురికి మాత్రమే దక్కే ఈ అవార్డు జిల్లాకు చెందిన తోటరాజశేఖర్‌కు దక్కడంపై రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు.

గిరిరాజ్ కళాశాలకు మరో అవార్డు



అవార్డును అందుకుంటున్న గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపల్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలకు ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా హైయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్‌లో ఐదవ స్థానంలో నిలిచింది. స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన గిరిరాజ్ కళాశాల 2025-26 విద్యాసంవత్సరానికి గాను రాష్ట్రంలోనే ఐదవ స్థానంలో నిలిచింది. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఉత్తమ ప్రమాణాలతో కొనసాగుతున్న గిరిరాజ్ కళాశాల రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను కలిగి ఉంది. ఈ అవార్డుకు ఎంపిక కావడంపై ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

'మలేరియా వ్యాధి నివారణకు కృషి చేయాలి'

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఘన్‌పూర్‌లో శుక్రవారం మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ మానస ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలే రియా వ్యాధిపట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ దోమలబెడదను నివారించుకొని మలేరియా బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సావిత్రి, మహాలక్ష్మి, దేవ్‌పాల, కరుణ, తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి మండల పరిషత్ ఎంపీడీవోగా భూక్యలింగం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండల పరిషత్ ఎంపీడీవోగా భూక్యలింగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వేల్పూర్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఇంచార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. డిచ్‌పల్లిలో ఉన్న సూపరింటెండెంట్ నివేదిత వేల్పూర్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఎంపీడీవో భూక్యలింగం మాట్లాడుతూ అందరి సహకారంతో డిచ్‌పల్లి మండల పరిషత్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

టీయూలో పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న సీవోఈ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో శుక్రవారం సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో పీజీ ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పరీక్షలతో పాటు ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్ సెమిస్టర్ థియరీ పరీక్షలు శుక్రవారం రెండవ రోజు ప్రశాంతంగా జరిగాయి. 74 మందికి విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారు. ఈ పరీక్షలను ఆడిట్‌సెల్ డైరెక్టర్ గంట చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ సంపత్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

గోదావరి వద్ద ఇద్దరి ఆత్మహత్యాయత్నం

● ముందుగానే గమనించి రక్షించిన పోలీసులు



ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలిని, మహిళను కాపాడిన పోలీసు

బాసర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బాసర వద్ద శుక్రవారం ఇద్దరు మహిళలు వేర్వేరుగా ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు ముందుగానే గమనించడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు సాయ మ్మ ,అదే మండలం ఫకీరాబాద్ కు చెందిన మరో మహిళలక్ష్మీ కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది బాసరకు వచ్చారు. గోదావరి తీరంలో అనుమానస్పదంగా తిరుగుతుంటే అక్కడే విధుల్లో ఉన్న పోలీసు కానిస్టేబుల్ మోహన్ సింగ్ అనుమానం వచ్చి విచారించగా ఆత్మహత్య విషయం వెలుగులోకి వచ్చింది .వేర్వేరుగా జరిగిన ఈ రెండు ఘటనలు కానిస్టేబుల్ సమయస్ఫూర్తితో రెండు ప్రాణాలు రక్షించారు.ఇద్దరికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుం బ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

పర్యాటకులపై దాడి అమానుషం



ఘన్‌పూర్‌లో నిరసన తెలుపుతున్న వేల్పూర్ భూమయ్య

డిచ్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో విహారయాత్రకు పర్యటనకు వెళ్లిన 26 మంది పర్యాటకులపై విచక్షణ రహితంగా పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులు చేసి హతమార్చడం తగదని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య ఖండించారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లిలోని ఘన్‌పూర్ గాంధీ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగచాటుగా దాడి చేయడం తగదని దమ్ము ధైర్యం లేని వారు ఇలాంటి దాడికి పాల్పడుతారని విమర్శించారు. అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న కారణంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రతినిధులు సాయరెడ్డి, గంగాధర్, శైలజా, సాయినాథ్, అరుణ్, సంజయ్, తిరుపతి, సుదర్శన్, మహేందర్, సాయిలు, శ్రీకర్, హరికేశవ్, గంగాధర్‌లు ఉన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో విహారయాత్రకు వెళ్లిన 26 మంది పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులు జరిపి హతమార్చడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు పాకిస్తాన్ దాడిని ఖండించాలని బీఆర్ఎస్ నాయకులు ధర్పల్లి జెడ్పీటీసీ సభ్యుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ ఖండించారు. శుక్రవారం సాయంత్రం డిచ్‌పల్లిలోని తెలంగాణ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ శాంతిని కోరుకుంటున్న భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే ఉద్దేశ్యంతోనే పర్యాటకులపై తుపాకీ కాల్పులు చేయడం శోచనీయమన్నారు. ఈ ఘటనలో అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని అన్నారు. ఈ నిరసనలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కృష్ణ, సూదం నాయక్, సాయిలు, ఇతర గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్ : జమ్మూకాశ్మీర్‌లో పహల్‌గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద విశ్వహిందూ పరిషత్ నాయకులు జెండాలను పట్టుకొని తీవ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా సహకార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో మన హిందువులపైన జరిగిన దాడిని ఖండిస్తూ హేయమైన చర్య అని అన్నారు. హిందువా అని అడిగి దాడి చేయడం భారతదేశంలో ఇప్పటి వరకు ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోలేదని అన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో మరొక సర్జికల్ స్ట్రైక్ చేసి ప్రపంచ పఠంలో పాకిస్తాన్‌ను లేకుండా తుడిచి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి దయానంద్, ఉపాధ్యక్షుడు ఆనంద్, కోశాధికారి శేఖర్, సంస్కార్ ప్రముఖ్ శేఖర్, నగర అధ్యక్షుడు శ్రీనివాస్, భజరంగ్‌దళ్ జిల్లా సహసంయోజక్ మహేష్, నగర సహ సంయోజక్ సురేష్, సాయికిరణ్, తరుణ్, కార్తిక్, రాజ్‌పుత్, సోను, పెద్ద సంఖ్యలో భజరంగ్‌దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు

● మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):గత ఎన్నికల్లో ప్రజలకు దొంగమాటలు చెప్పి సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదిహేను నెలలైనా ఇప్పటి వరకు ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. 2 లక్షల రుణమాఫీ సగం మందిరైతులకు కూడా చేయలేదన్నారు. రైతు భరోసాను పెంచి ఇస్తానని చెప్పి ఇప్పటికీ సగం మంది రైతులకు కూడా ఖాతాల్లో జమచేయలేదన్నారు. రైతు భరోసాను 15వేల నుంచి 12వేలకు తగ్గించి పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదన్నారు. మొదట ధాన్యానికి మొత్తం బోనస్ ఇస్తామని ప్రకటించి మళ్లీ మాటమార్చి సన్నరకాలకే అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. అదికూడా పూర్తిస్థాయిలో రైతులకు అందించడం లేదన్నారు. పసుపుకు క్వింటాలుకు 12వేల మద్దతు ధర కల్పిస్తామని చెప్పి ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన విమర్శించారు. పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలబెట్టాడని ఆయన అన్నారు. రాష్ట్రం ఏర్పడే వరకు 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండేదన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర మాజీ మేయర్ దండు నీతూకిరణ్, సీనియర్ నాయకులు రాంకిషన్‌రావు, మాజీ జడ్పీటీసీలు గడ్డం సుమన, బాజిరెడ్డి జగన్, పార్టీ నగర అధ్యక్షుడు సిర్పరాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, సూదం రవిచందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చారు

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ఎప్పుడో వీఆర్ఎస్ ఇచ్చారని, కేసీఆర్‌కు వీడ్కోలు పలికేందుకే రజతోత్సవాలను నిర్వహిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి కార్యశాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడా, జాతీయ అధ్యక్షుడా తెలియడం లేదన్నారు. మహరాజులా పాలించిన కేసీఆర్ తన పాలన మొత్తాన్ని యువరాజు, యువరాణిలకు అప్పజెప్పేందుకు చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రస్థానం అవినీతికి మారుపేరైతే, టీఆర్ఎస్ పాలన కుటుంబ పాలనకు పెట్టింది పేరన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ఎక్కడికి పోయాయో తెలియదన్నారు. అప్పులు, ఆత్మహత్యలు, అక్రమాల పుట్టగా రాష్ట్రాన్ని మార్చారన్నారు. ఉత్సవాలు ఎవరికోసమో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. ఉత్సవాల తర్వాత బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఉండరని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాలు ఎందుకు జరుపుకుంటుందో తెలియడం లేదన్నారు. టీఆర్ఎస్ ఎప్పుడో గాలిలో కలిసిపోయిందన్నారు. నాలుగు కోట్ల మంది ప్రజల కోసం టీఆర్ఎస్ పార్టీ ఏర్పడితే నలుగురి కోసం మిగిలిన విషయం అందరు గమనించారన్నారు. దేశంలో బీఆర్ఎస్ పార్టీలాగా ఫెయిల్ అయిన పార్టీ లేదన్నారు. దేశ పార్టీ అని ఏ రాష్ట్రంలోనూ పోటీ చేయలేదన్నారు. కేసీఆర్‌కు రజతోత్సవ సభ చివరి రోజులన్నారు. కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం టెర్రరిస్టులపై కఠిన చర్యలకు పూనుకుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, నాయకులు లక్ష్మీనారాయణ, పిల్లి శ్రీకాంత్, ఆమందు విజయ్ పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని 5వ డివిజన్ ప్రాంతంలో ఉదయం 5గంటల ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్యంపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి, కార్మికులకు పలు సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరుపట్టికను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణస్వీకారం



నూతన బార్ అసోసియేషన్ సభ్యులతో న్యాయాధికారులు

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బార్ అండ్ బెంచ్ రథ చక్రాల లాంటివని నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.వి.ఎన్ భరత లక్ష్మీ తెలిపారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని పిపి.గంగారెడ్డి మెమోరియల్ హాల్‌లో నిర్వహించిన నిజామాబాద్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లాకోర్టు అవసరాలకు అనుగుణంగా,వాహనాల రద్దీ, కక్షిదారుల రాకపోకలు పెరిగినందున మరింత ఖాళీస్థలం అవసరం ఉన్నదని ఆమె అన్నారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌తో మాట్లాడం జరిగిందని ప్రభుత్వ భూమి జిల్లా న్యాయవ్యవస్థకు చేకూరుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. తాను నూతనంగానే బదిలీపై వచ్చానని,రాగానే నూతన బార్ అసోసియేషన్ తన సమక్షంలో కొలువుతీరడం శుభసంకేతమేనని జిల్లాజడ్జి భరత లక్ష్మీ వ్యాఖ్యానించారు. తన పదవీకాలంలో బార్ సంపూర్ణ సహాయ,సహకారాలు అందించాలని ఆమె కోరారు. బార్ అధ్యక్షుడు మామిల్ల సాయరెడ్డి మాట్లాడుతూ కోర్టుల సంఖ్య పెరిగిందని దాంతోపాటు మోటారు వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న మూలంగా జిల్లాకోర్టుకు ఆనుకుని ఉన్న విద్యాశాఖ స్థలాన్ని పరిశీలించాలని విన్నవించారు. కార్యక్రమంలో అదనపు జిల్లాజడ్జిలు శ్రీనివాస్, ఆశాలత,జూనియర్ సివిల్ జడ్జిలు ఖుష్బూ ఉపాధ్యాయ్ ,గోపికృష్ణ,శ్రీనివాసరావు, న్యాయవాదులు ఆకుల రమేష్, జి. తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ అదనపు(మహిళ కోర్టు) జిల్లా న్యాయాధికారిగా నియమితులైన హరీష,సీనియర్ సివిల్ న్యాయాధికారులుగా బదిలీపై వచ్చిన ఉదయ భాస్కర్ రావు, సాయిసుధలకు నిజామాబాద్ బార్ అసోసియేషన్ పూలమాలలు అందజేసి స్వాగతం పలికారు. నిజామాబాద్ జిల్లా జడ్జిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన జిల్లా న్యాయాధికారిని జీ.వీ.ఎస్.భరతలక్ష్మిని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు కొద్దిసేపు భేటీ అయి జిల్లా స్థితిగతులపై చర్చించారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98000	రూ.90,400	రూ.1030

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సారంగపాణి జాతకం (10.40, 1.30, 4.20, 7.10, 10.10)
స్క్రీన్-2 : శివ శంభో (11.10)
: నీజా-2 (3డి ఇంగ్లీష్) (1.40, 4.40, 7.40)
: తుదరం (10.40)
స్క్రీన్-3 : జింఖాన (11.25, 7.25)
: శౌర్యపరం (2.20)
: అంటిల్ డౌన్ (ఇంగ్లీష్) (5.00, 10.20)
స్క్రీన్-4 : ఏఎల్‌సీసీ (11.25)
: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (2.00)
: ది చూసెన్ లాస్ట్ సుప్పర్ (ఇంగ్లీష్) (5.00)
: సోదర (7.35)
: సూర్యపేట జంక్షన్ (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : జింఖాన (11.00, 4.40, 7.40, 10.30)
: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (1.40)
స్క్రీన్-2 : సారంగపాణి జాతకం (10.40, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-3 : శౌర్యపరం (11.00)
: సూర్యపేట జంక్షన్ (4.40, 10.20)
: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (7.30)

లలితామహల్ : సారంగపాణి జాతకం (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : జింఖాన (11.15, 6.15)
: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (2.15, 9.15)
నటరాజ్ : సూర్యపేట్ జంక్షన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఓదెల-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్

రజతోత్సవ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి

ధర్పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, విద్యావంతులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఆరు గ్యారంటీల అమలులో విఫలమయ్యారని విమర్శించారు.

అలరించిన క్రీడలు



గెలుపొందిన నిజామాబాద్ పైరేట్స్ జట్టు

సిరికొండ ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్మూర్ మినీ స్టేడియంలో జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్రలకు చెందిన క్రీడా కారులు పాల్గొన్న మేజర్ లీగ్ బేస్‌బాల్ క్రీడల పోటీల్లో నిజామాబాబాద్ పైరేట్స్ జట్టు గెలుపొంది చాంపియన్ షిప్ ట్రోఫీని అందుకుంది. మూడు రాష్ట్రాల నుంచి 12 జట్లు పాల్గొన్న క్రీడల పోటీలు ఈ నెల 21 నుంచి 24 వరకు ఆర్మూర్ మినీ స్టేడియంలో జరిగాయి. ఇందులో ఫైనల్‌లో తొర్లికొండ జటుపై సిరికొండకు చెందిన క్రీడాకారులు నిజామాబాద్ పైరేట్స్ పేరుతో ఆడి విజేతగా నిలిచారు. మేజర్ లీగ్ బేస్‌బాల్ కప్ ఇండియా ఇన్‌చార్జీ మిస్టర్ రియో చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు.ట్రోఫీని గెలుచుకున్న క్రీడకారులను సత్యాశోధక్ ఎడ్యుకేషన్ సొసైటి అధ్యక్షులు ఆర్.నర్సయ్య అభినందించారు.

కార్మిక వ్యతిరేక చట్టాల రద్దు కోసం పోరాడుదాం



సిరికొండలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరికొండ ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) నరేంద్రమోదీ ప్రభుత్వం చట్టాల రద్దు చేసిన కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుదామని టీయూ సీఐ జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. సిరికొండలో మేడే వారోత్సవాల పోస్టర్లను కార్మికులతో కలిసి శుక్రవారం సిరికొండలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మేడే రోజున వాడవాడల్లో అరుణ పతకాలను ఎగుర వేయాలని ఆయన కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుక వచ్చిందన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా చేసిన చట్టాల రద్దు కోసం కార్మికులు పోరాటాలు చేయాలని రమేష్ పిలుపు నిచ్చారు. యాంత్రికరణ పేరుతో 8గంటల పనిని నాలుగు గంటలు చేసినసరిపోతుందని చెప్పిన ప్రభుత్వం పెట్టుబడిదారులు,కార్పోరేట్ల కంపెనీల వారు 12గంటల పాటు పనులు చేయిస్తు కార్మికుల రక్తా మాంసాలను పీల్చుకుతింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకని కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలలో 15 చట్టాలను మాయం చేసిందని రమేష్ ఆరోపించారు.కార్మికులు మేల్కొని రద్దు చేసిన చట్టాల కోసం పోరాడాలని రమేష్ కోరారు. కార్యక్రమంలో దామోదర్, సాయరెడ్డి, బొర్రన్న, బాలకృష్ణ, సుజాత, రాజవ్వ పాల్గొన్నారు.